సాక్షి
విజయనగరం
బుధవారం । 14 । ఆగస్టు । 2024



నాటి గుర్తులు.. నేటికీ పదిలం

భరతమాత దాస్య శృంఖలాలను తెంచేందుకు ఎందరో మహానుభావులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారు. - 8లో



మా పరిస్థితి ఏమిటి?

మహిళలకు ఉచిత బస్ పథకాన్ని స్వాగతిస్తున్నామని, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటో కూటమి ప్రభుత్వం చెప్పాలని పలువురు డిమాండ్ చేశారు. - 8లో

జెండా పండగకు మంత్రికి ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ మరియు ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

శ్రావణలక్ష్మిగా పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: సిరుల తల్లి పైడితల్లి అమ్మవారు శ్రావణమాసం రెండో మంగళవారం పురస్కరించుకుని శ్రావణలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలలో వేకువజామునుంచి అమ్మవారికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అమ్మవారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను, ఘటాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్ల వద్ద దీపారాధనలు చేశారు.

సస్యరక్షణతో రెట్టింపు దిగుబడులు

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, శ్రీనివాస్



నాయుడువలసలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

రామభద్రపురం: పంటను ఆశించిన చీడపీడలను సకాలంలో గుర్తించి నివారించడంతో పాటు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే రెట్టింపు దిగుబడులు వస్తాయని విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నాయుడువలసలో మొక్కజొన్న, పత్తి పంటలను మంగళవారం పరిశీలించారు. ఎండు తెగులు నివారణ చర్యలను వివరించారు. పురుగు మందుల పిచికారీ, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సంధ్యారాణి, చిట్టిబాబు, వీపీఏ డబ్ల్యూ.ఎస్.శర్మ పాల్గొన్నారు.

గొర్రిపాటి పేరు తొలగించడం అవమానకరం

బొబ్బిలి: తాటిపూడి జలాశయానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును నామకరణం చేసింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఆ పేరును తొలగిస్తూ జీఓ నంబర్ 38 జారీ చేయడం విచారకరం. ఇది ఆ సామాజిక వర్గానికి, మహోన్నత వ్యక్తికి అవమానం కలిగించినట్టేనని కొప్పుల వెలమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్నాథం, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు. రైతులు, సామాజిక వర్గ నాయకులు కలిసికట్టుగా పోరాడి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

జూట్ పరిశ్రమలను ఆదుకోండి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న జూట్ అసోసియేషన్ ప్రతినిధులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్రలో ఉన్న జూట్ పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర జ్యూట్ అసోసియేషన్ సభ్యులు కిమిడి నాగార్జున, టీవీఎస్ లింగమూర్తి, సునీల్ భారరియా, హర్షసహత తదితరులు కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మంగళవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జూట్ పరిశ్రమలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. జూట్ పరిశ్రమలు సంక్షోభం నుంచి బయటకు రావాలంటే కేంద్ర ప్రభుత్వ సహాయ, సహకారాలు అవసరమన్నారు. జూట్ ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఆదుకోవాలని కోరారు.

అప్పుడు:

'అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ వేస్తాం. నిరుద్యోగ అభ్యర్థుల ఉద్యోగకల నెరవేర్చుతాం. జీవో నంబర్ 117ను రద్దు చేస్తాం. ప్రభుత్వ బడులను బాగుచేసే బాధ్యత నాది. ఉపాధ్యాయులూ.. మీ మాటే నా మాట.'

– ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు ఇవి

ఇప్పుడు:

అధికారం చేజిక్కింది. అన్నివర్గాల ప్రజలతో పాటు మేధావివర్గమైన ఉపాధ్యాయులు, డీఎస్సీ ఆశావహులకు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమయ్యారు. 117 జీవో ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు సన్నద్ధమయ్యారు. కౌన్సెలింగ్‌కూ పిలిచారు. జిల్లాలో బోలెడు మంది ఉపాధ్యాయులకు పని లేదని, మిగులు పోస్టులు ఉన్నాయని, డీఎస్సీ ఇప్పట్లో అవసరం లేదన్నది ఉపాధ్యాయుల ఆందోళనతోనే చెప్పించి డీఎస్సీ ఆశావహులకు వెన్నుపోటు పొడించేందుకు పూనుకున్నారు. సీఎం చంద్రబాబు కుతంత్ర పాలనను పసిగట్టిన ఉపాధ్యాయ వర్గం అప్రమత్తమైంది. కౌన్సెలింగ్‌ను బహిష్కరించింది. జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపడుతోంది.

ఉపాధ్యాయులు, డీఎస్సీ ఆశావహులకు..
వెన్నుపోటు

- మరో ఎన్నికల హామీకి కూటమి ప్రభుత్వం తూట్లు
- జీవో 117 రద్దు చేస్తామంటూ మోసం..
- అధికారంలోకి వచ్చాక మాటతప్పిన వైనం
- పని సర్దుబాటు పేరుతో మరిన్ని మిగులు పోస్టుల జాబితా
- 'మిగులు'తో మెగా డీఎస్సీకి మంగళం పాడేయడానికే?



టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మళ్లీ రోడ్డెక్కారు. 'పని సర్దుబాటు' ముసుగులో తీసుకుంటున్న అసంబద్ధమైన నిర్ణయాలను నిరసిస్తూ ఎక్కడికక్కడ గళం వినిపిస్తున్నారు. జీవో 117తో కాకుండా జీవో నంబర్ 53 ప్రకారం సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అవేకాదు పలు డిమాండ్లతో వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ప్రతి మండలంలోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కూటమి ప్రభుత్వం కుతంత్ర పాలన ఒక్కోవర్గాన్ని తాకుతోంది. ఆయా వర్గాలను ఆవేదన, ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పుడా జాబితాలో ఉపాధ్యాయులు, డీఎస్సీ ఆశావహులు కూడా చేరిపోయారు. అసంబద్ధమైన విధానంలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను కూటమి ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఉపాధ్యాయ సంఘాల సూచనలను పెడచెవిన పెట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే 117జీవోను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన టీడీపీ నాయకులే ఇప్పుడు ముఖం చాటేయడాన్ని ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గతం కంటే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ ప్రకారం పని సర్దుబాటు కోసం మిగులు ఉపాధ్యాయుల జాబితాలను ప్రభుత్వం వెల్లడించింది. ఈనెల 12వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఉపాధ్యాయులను ఎంఈఓ కార్యాలయాలకు రమ్మని వర్తమానాలు పంపించడంపై రగిలిపోయారు. ఫ్యాప్టో పిలుపుతో ఆ కౌన్సెలింగ్‌ను ఉపాధ్యాయులు నిర్ద్వంద్వంగా బహిష్కరించారు.

మిగులు పోస్టులు మరిన్ని...

కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ అమలు ఎలా ఉన్నా ప్రస్తుతానికి విజయనగరం జిల్లాలో 468 ఉపాధ్యాయుల పోస్టులు, పార్వతీపురం మన్యం జిల్లాలో 154 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజాగా 'పని సర్దుబాటు' కోసం రూపొందించిన జాబితాల ప్రకారం విజయనగరం జిల్లాలో 1548 వరకూ, పార్వతీపురం మన్యం జిల్లాలో 613 మిగులు పోస్టులు చూపిస్తున్నారు. మండల స్థాయిలో ఆయా పోస్టులు సర్దుబాటు చేసిన తర్వాత కూడా ఇంకా భారీగానే మిగులు పోస్టులు ఉంటాయి. ఆ మిగులు ఉపాధ్యాయులను ఏమి చేస్తారనేది స్పష్టమైన సమాచారం లేకపోవడం తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. సర్‌ప్లస్ ఉన్నాయని తెలిసీ ఎలా పని సర్దుబాటు కౌన్సెలింగ్‌కు పిలిచారనేది చర్చనీయాంశమైంది.

డీఎస్సీ తాత్సారానికే...

మెగా డీఎస్సీ అంటూ ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. తీరా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా దాన్ని తాత్సారం చేయడానికే కూటమి ప్రభుత్వం 'పని సర్దుబాటు' నాటకానికి తెరతీసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగులు ఉపాధ్యాయులు ఉన్నప్పుడు కొత్తగా ఉద్యోగాలు భర్తీ చేసి ఉపయోగమేమిటని ఉపాధ్యాయులతోనే చెప్పించి డీఎస్సీ ఆశావహులకు వెన్నుపోటు పొడవాలనేదీ కుతంత్రమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జీవో 117 రద్దు చేస్తామన్న హామీ అమలు చేయాలి...



ఉపాధ్యాయ పోస్టులను కుదించే జీవో 117ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాటి హామీని అమలు చేయాలి. 3, 4, 5 తరగతులు హైస్కూల్‌లో కలపాలన్నది ఈ జీవో ఉద్దేశం. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ఇప్పుడా జీవో ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం సరికాదు. ఒకవేళ సర్దుబాటు తప్పనిసరి అయితే ప్రస్తుతం మిగులు చూపిస్తున్న ఉపాధ్యాయులను అదే పాఠశాలల్లో కొనసాగించాలి. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి హైస్కూల్‌లో 1:40గా, ప్రాథమిక పాఠశాలలో 1:20గా ఉండేలా సర్దుబాటు చేయాలి.

– ఇజ్జురోతు రామునాయుడు, రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం





జీవో 53 ప్రకారం సర్దుబాటు చేయాలి



కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కావస్తున్నా విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో ఇంతవరకు పూర్తి స్థాయి చర్చలు జరపలేదు. ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సంబంధించి మొదటి నుంచి ఉపాధ్యాయ సంఘాలు జీవో 53నే అమలు చేయాలని చెబుతున్నాం. రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జీవో 117ను కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ షెడ్యూల్ విడుదల చేయడం సరికాదు. ప్రాథమిక విద్యకు సంబంధించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధానం ఉండాలి. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ పోస్టులను విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కొనసాగించాలి.

– డి.శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం

నిర్ణయం సరికాదు



కూటమి ప్రభుత్వం జీవో 117 ద్వారా ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయం సరైనది కాదు. దీంతో భవిష్యత్తులో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిరుద్యోగులను పూర్తిస్థాయిలో మోసం చేసేందుకే ఈ జీవోను ఉపయోగిస్తున్నారు.

– రెడ్డి మోహనరావు, యూటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి

నిబంధనలకు విరుద్ధం



ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలకు విరుద్ధంగా చేయడం సమంజసం కాదు. జీవో 117 రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు ఎలా చేస్తారు? ఇది తీవ్ర అన్యాయం.

– వలిరెడ్డి రవీంద్రనాయుడు, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ, విజయనగరం

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోస్టులు కేటాయించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల నియామకాల విధానాన్ని విద్యార్థుల సంఖ్య ఆధారంగా అమలు చేయాలి. ఉన్నత పాఠశాలల్లో సెక్షన్ల ప్రకారంగా కాకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోస్టులను కేటాయిస్తే పోస్టులు మిగలవు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలి. వర్క్ బుక్స్ వంటి పనిఒత్తిడి దృష్ట్యా పోస్టులను పెంచాలి. విద్యార్థుల సంఖ్య 25 దాటితే మూడు పోస్టులు కేటాయించాలి. జీవో 117 ఆధారంగా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం వల్ల ప్రతి మండలం పరిధిలో కనీసం 50 పోస్టులు తగ్గుతున్నాయి. ఈ మిగులు పోస్టులను మండల పరిధిలో మాత్రమే సర్దుబాటు చేయాలి.

– కేపీవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

విద్యారంగంలో ప్రమాద ఘంటికలు



యూపీ స్కూల్స్‌లోని స్కూల్ అసిస్టెంట్స్‌ను తీసేయడం దుర్మార్గం. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను మిగులు చూపించి వారి స్థానంలో ఎస్‌జీటీలను నియమించడం సరికాదు. ప్రభుత్వ బడుల్లోని ఉపాధ్యాయులను తక్కువ చూపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తారు. తద్వారా ప్రభుత్వ బడులు పెద్దఎత్తున మూతపడే ప్రమాదం ఉంది.

– కె.విజయగౌరి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

విద్యుత్ సౌకర్యం కల్పనకు ఆదేశం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని సియోనువలస, చిన అక్కివలస, రామన్నదొరవలస, కృపావలస, దీవెనవలస గిరిజన గ్రామాల్లో సుమారు 60 కుటుంబాలు, దత్తిరాజేరు మండలం షికారుగంజి పంచాయతీ పరిధిలోని ఎస్.టి.కొత్తవలస గ్రామంలో 74 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామస్తుల విద్యుత్ సదుపాయం వినతి మేరకు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ తన చాంబర్లో మంగళవారం సమావేశమయ్యారు. ఆయా గ్రామాలు రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉండడం వల్ల విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ అభ్యంతరం వ్యక్తంచేస్తోందని అధికారులు చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా గ్రామస్తులను ఒప్పించి వేరేచోట వారికి స్థలాలు కేటాయించి అన్ని వసతులూ సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఫారెస్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వాయిదా

జిల్లాలో ఈనెల 16 నుంచి ప్రారంభం కావాల్సిన రెవెన్యూ సదస్సులు తాత్కాలికంగా వాయిదా పడ్డాయని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, వీఆర్వోలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కొత్త షెడ్యూల్ వచ్చాక ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా సదస్సులు నిర్వహించాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు. సదస్సుల నిర్వహణలో లోటుపాట్లు జరిగితే వీఆర్వోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.డి.అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, మండల ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌బాబు

విజయనగరం ఫూల్‌బాగ్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో సాగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక అమర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం పెరగడంతో విద్యార్థుల జీవితాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. విద్యార్థులందరూ గాంధీజీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, చేగువేరా స్ఫూర్తితో క్రమశిక్షణగా దేశ భవిష్యత్తును కాపాడాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ఏఐవైఎఫ్ మన్యం జిల్లా విజయనగరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీటీ నాయుడు, గోపినాయుడు, బూర వాసు, కోట అప్పన్న, రెండు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపాలి

విజయనగరం అర్బన్: ఇళ్ల నిర్మాణంలో ప్రతిరోజూ పురోగతి ఉండాలని, రోజుకు 195 ఇళ్లకు తక్కువ కాకుండా ప్రగతి కనిపించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. గృహ నిర్మాణంపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 11,191 ఇళ్ల నిర్మాణం నేటికీ ప్రారంభం కాలేదని, వీటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇకనుంచీ ఏఈల వారీగా సమీక్షిస్తామన్నారు. గృహ నిర్మాణశాఖలో తగినంత సిబ్బంది ఉన్నప్పటికీ ఎందుకు పురోగతి కనిపించడం లేదని ప్రశ్నించారు. వారానికి 1365 ఇళ్ల స్టేజ్ కన్వర్షన్ జరగాలని స్పష్టం చేశారు. మంజూరైన వాటిలో ఇంకా 38,671 ఇళ్లు వివిధ స్థాయిల్లో ఉన్నాయని, వాటిని వీలైనంత వేగంగా పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. సమీక్ష సమావేశంలో జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రావెల్ తవ్వకాలపై పరిశీలన



బురుజోల మెట్టపై గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమామహేశ్వరరావు బృందం

సాక్షి ఎఫెక్ట్...

భామిని: 'పచ్చదనం కనుమరుగు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనం పట్ల అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా అధికారుల ఆదేశాలతో భామిని మండలం బురుజోల మెట్టపై గ్రావెల్ అక్రమ తవ్వకాలను తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఎంఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్ఓ జి.వెంకటరమణల బృందం బురుజోల మెట్టను సందర్శించి అక్రమంగా తవ్విన గ్రావెల్ గోతులను పరిశీలించారు. బురుజోల మెట్టపై ఆక్రమ గ్రావెల్ తవ్వకాలతో పచ్చదనం కనిపించకుండా పోతున్నట్లు గుర్తించారు. మెట్టను సందర్శించే సమయానికి తవ్వకాలు జరగడం లేదని, గ్రావెల్ తవ్వకానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ స్పష్టం చేశారు.

అర్ధరాత్రి తిరిగితే కేసులు తప్పవు

- నేరాల నియంత్రణకు రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌లో మార్పులు
- నిరంతరం కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో సహేతుక కారణం లేకుండా అర్ధరాత్రి బహిరంగంగా తిరిగితే వారిపై కేసులు నమోదుచేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి 11 గంటల తర్వాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు, మూసేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, సహేతుకమైన కారణం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా వారిపై కేసులు నమోదుచేయడంతో పాటు, వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి, కౌన్సె లింగ్ నిర్వహించాలని చెప్పారు. సహేతుకరమైన కారణం లేకుండా పట్టణాల్లో మూడురోజులుగా సంచరిస్తున్న 121 మందిపై పోలీసులు కేసులు నమోదుచేసి, వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రాత్రి గస్తీలో మార్పులు

నేరాల నియంత్రణలో భాగంగా ఇప్పటివరకూ నిర్వహిస్తున్న రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌లో మౌలికమైన మార్పులను చేపట్టారు. రాత్రి విధులకు వెళ్లే పోలీసు సిబ్బందితో సంబంధిత పోలీసు అధికారులు సమావేశమై, రాత్రి గస్తీలో వారు నిర్వహించాల్సిన విధులు పట్ల దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఆయా బీట్ల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, పాయింట్ పుస్తకాలు గల ప్రాంతాలను తప్పనిసరిగా సందర్శించే విధంగా చర్యలు చేపట్టారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పెట్రోలింగ్ తిరిగే వాహనాలను, బీట్ పర్యవేక్షణ అధికారులను నిరంతరం రాత్రుళ్లు అప్రమత్తం చేయాలని పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా, అవసరమైన సమయాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టేవిధంగా చర్యలు చేపట్టారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం టౌన్: ఈ నెల 8న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పెందుర్తికి చెందిన భార్యాభర్తలపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తికి చెందిన భార్యాభర్తలు విజయనగరం రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడి నుంచి పెందుర్తి వెళ్లేందుకు వేరే ట్రైన్ లేనందున రైల్వేస్టేషన్ నుంచి బయటకు వచ్చి టీ తాగుదామని వేచి ఉన్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్దకు వచ్చి, అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, అడ్డు వచ్చిన భర్తను దారుణంగా కొట్టి హత్యాయత్నానికి పాలప్డారు. ఆ సమయంలో భార్యభర్తలు చాకచక్యంగా తప్పించుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కలెక్టరేట్ సమీపంలో ఎస్సీ కాలనీకి చెందిన కోరాడ దండు అలియాస్ దండు రాజు, కంటోన్మెంట్‌కు చెందిన బొగ్గ సూరి, అలియాస్ సూర్యలను అరెస్ట్ చేశారు. కేసులో నిందితులు ఉపయోగించిన కర్రను, చాకును సీజ్ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరిలించినట్లు సీఐ వివరించారు.


చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

నాటి గుర్తులు.. నేటికీ పదిలం


భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంతో సాలూరులో నిర్వహిస్తున్న భారీ ర్యాలీ (ఫైల్)


సాలూరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న వెంకటనారాయణ దొర (ఫైల్)

- స్వాతంత్ర్యోద్యమంలో సాలూరు వాసులు
- ప్రథమ శాసనసభ్యుడు స్వాతంత్ర్యసమరయోధుడే


ఇందిరాగాంధీతో కూనిశెట్టి వెంకటనారాయణ దొర(ఫైల్)

సాలూరు: భరతమాత దాంస్య శృంఖలాలను తెంచేందుకు ఎందరో మహానుభావులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారు. ఈ నేపథ్యంలో భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో సాలూరుకు చెందిన యోధులు అలుపెరగని పోరాటంలో పాల్గొన్నారు. ఆనాటి స్వాతంత్ర్య సమర యోధుల్లో సాలూరుకు చెందిన కూనిశెట్టి వెంకటనారాయణదొర, బెంజిమన్ ఫ్రాంక్లిన్, దారాముక్కల యగ్నేశ్వరశర్మ తదితరులు ఉన్నారు. భారతదేశానికి స్వాత్రంత్య కాంక్ష ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న ఆ రోజుల్లో సాలూరు సెంటర్‌లో వందేమాతర నినాదాలు చేస్తున్న యువకుడైన నారాయణదొరపై ఆంగ్లేయులు విచక్షణారహితంగా లాఠీలతో కొట్టినా తన వందేమాతర నినాదాన్ని ఆయన వదల్లేదు. చివరకు అయనను బరంపురం సి-క్లాసు జైలుకు తరలించి కఠిన కారాగార శిక్ష విధించారు. సుమారు ఏడాదిన్నర పాటు జైలు జీవితాన్ని ఆయన అనుభవించారు. ఎన్నో పోరాటాలు త్యాగాల ఫలితంగా భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం రాగా సాలూరు ప్రజలంతా తమ నాయకుడిగా భావించిన యువకుడైన నారాయణదొరను ఊరంతా గుర్రంపై ఊరేగించారు. తమ ప్రియతమ నాయకుడిని సాలూరు గాంధీగా పిలుచుకున్నారు. సాలూరులో తొలి జాతీయజెండాను నారాయణదొర ఎగురవేసి భారత స్వాత్రంత్య సంగ్రామంలో సాలూరు ఖ్యాతిని చాటి చెప్పారు. అనంతరం 1952లో దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆచార్య ఎన్‌జీ రంగా స్థాపించిన కృషికార్ లోక్ పార్టీ తరపున అఖండ మెజారిటీతో సాలూరు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు.

నాటి నిర్ణయాల నేటి గుర్తులు

- నాడు జరిగిన స్వాతంత్ర్యపోరాటాలకు ఆనవాళ్లుగా నేటికీ సాలూరు పట్టణంలోని పలు ప్రాంతాలు నిలుస్తున్నాయి. భారత స్వాతంత్ర్య సాధనలో భాగంగా ఆంగ్లేయుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ దేశనాయకులు ఇచ్చిన పిలుపుపై స్థానిక నాయకులు, ప్రజలు అర్ధరాత్రి వేళ సమావేశాలను ప్రస్తుత పెదబజారులోని గాంధీపార్కు వద్ద ఉన్న మర్రి చెట్టు కింద నిర్వహించేవారు.
- దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన నేపథ్యంలో సగర్వంగా మన జాతీయ పతాకాన్ని ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోనే ఎగురవేశారు.

15వ ఏట స్వాతంత్ర్య సమరంలోకి


కూనిశెట్టి వెంకట నారాయణ దొర(ఫైల్)

1907 జులై 4న కూనిశెట్టి యరకన్న దొర, సాయమ్మలకు తొలిసంతానంగా వెంకటనారాయణదొర జన్మించారు. విలాసవంతమైన కుటుంబ నేపథ్యంలో జన్మించిన ప్పటికీ, భారత స్వాతంత్ర్య సమరంలో ఇంటికో యోధుడిని తయారుచేసి దేశానికి అంకితం చేయాలని దేశప్రజలు సంకల్పించిన రోజులలో తన 15వ ఏట స్వాతంత్ర్య సమరంలోకి నారాయణదొర అడుగులు పడ్డాయి.

కొన్ని సంఘటనలు

- సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా కల్లు, సారా వేలం పాటలు జరగకుండా 1922లో సాలూరులో నారాయణదొర ఉద్యమించారు. విదేశీవస్తు బహిష్కరణకు తోడ్పడ్డారు.
- "1930లో విశాఖపట్నంలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 6 నెలలు కఠిన కారాగార శిక్ష అనుభవించారు.
- "1932లో గుంటూరులో గాంధిజీ శిష్యురాలు వేదాంతం కమలాదేవి అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య పోరాట సమావేశంలో దొర ప్రముఖ పాత్ర వహించినందుకుగాను బ్రిటిష్ పాలకులు అరెస్ట్ చేశారు.
- 1936 నవంబరు 14న ఓ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ ప్రాణాలను నారాయణ దొర కాపాడారు.
- "1937లో సాలూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వందేమాతర నినాదాలతో హోరెత్తిస్తూ ప్రజలను దేశభక్తి వైపు ప్రభావితం చేస్తున్నందుకు ఆనాటి పార్వతీపురం డీఎస్‌పీ హోమిల్టన్ దొర విచక్షణారహితంగా నారాయణదొరను లాఠీలతో కొటించ్చి అరెస్ట్ చేసి బరంపురం జైలుకు తరలించారు. ఏడాదిన్నర బందీగా ఉన్నారు.
- 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమానికి సాలూరు తరపున నారాయణ దొర నాయకత్వం వహించారు.
- ఇలాఅనేక ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొని భారతదేశానికి స్వాతంత్ర సాధనకు నారాయణదొర తనవంతు విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం స్వాతంత్రానంతరం తామ్రపత్రంతో ఆయనను సత్కరించింది.
- సాలూరు నియోజకవర్గ తొలి శాసనసభ్యుడిగా ఎన్నికైన తరువాత సాలూరు ప్రజలకు అనేక మంచి కార్యక్రమాలు చేసి నిస్వార్థ రాజకీయాలును చేసి ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.


స్వాత్రంత్ర్య సమావేశాలకు నిలయమైన మర్రి చెట్టు (ఫైల్)

మెయిన్‌రోడ్డుగుండా భారీ ర్యాలీ చేశారు.

విశాఖపట్నం రాజధానిపై నాడు తీర్మానం

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్ర విభజన సమయంలో విశాఖపట్నం రాజధాని చేయాలనే తీర్మానాన్ని కూనిశెట్టి వెంకటనారాయణ దొర తీసుకువచ్చారు. పలు రాజకీయ కారణాలతో నాడు ఈ తీర్మానం ఓటమి పాలవడంతో కర్నూలు రాజధానిగా నాడు ఏర్పాటైంది.

16 నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

- వివిధ జిల్లాల నుంచి హాజరుకానున్న 180 మంది క్రీడాకారులు
- 19న పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం
- జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.నాయుడు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం వేదికగా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.నాయుడు మంగళవారం తెలిపారు. నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మొత్తం నాలుగు రోజుల పాటు సీనియర్స్ విభాగంలో స్త్రీ, పురుషలకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 180 మంది క్రీడాకారులు హాజరుకానుండగా... మొదటి రోజు 16న క్వాలిఫై పోటీల్లో క్రీడాకారులు తలపడతారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఈ నెల 17,18, 19 తేదీల్లో డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విజేతలకు ఈనెల 19న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 8 నుంచి 11వ తేదీ వరకు రాజమండ్రిలో జరగనున్న ఆల్ ఇండియా సౌత్ జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తలపడతారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ చూపేవారిని బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయనగరంలో జరుగుతున్న పోటీలను జిల్లాలోని క్రీడాభిమానులంతా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సున్న సురేష్, వై.కుసుంబచ్చన్, పాట్నూరు శ్రీరాములు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


శ్రావణి (ఫైల్)

లక్కవరపుకోట: కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువతి విశాఖపట్నంలో గల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్లేపల్లి గ్రామానికి చెందిన జామి శ్రావణి(19) ఈ నెల 5వ తేదీన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పంటలకు వినియోగించే పురుగు మందు తాగేసింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి లక్ష్మి గమనించి అడగ్గా కడుపు నిప్పి తట్టుకోలేక పురుగు మందు తాగానని చెప్పడంతో హుటాహుటిన కొత్తవలస ఆస్పత్రికి తీసుకువెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలో గల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. శ్రావనికి ఇటీవల కొత్తవలస మండలం అడ్డూరువానిపాలెం గ్రామానికి చెందిన యువకుడితో వివాహమైంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మా పరిస్థితి ఏమిటి?

- ఆటోవర్కర్స్ యూనియన్ డిమాండ్


విలేకరుల సమావేశంలో సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: మహిళలకు ఉచిత బస్ పథకాన్ని స్వాగతిస్తున్నామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్‌మోహన్‌రావు, బి.రమణలు అన్నారు. అయితే ఈ పథకం అమలుకు సంవత్సరానికి రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసిన ప్రభుత్వం, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కలిగే నష్టాన్ని ఎలా భర్తీ చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారం చేపట్టి 2 నెలలైనా వాహన మిత్రపై ఎలాంటి స్పష్టత లేదు. లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు వాహనమిత్ర ఇవ్వాలి. కరోనా సమయం నుంచి ఆటో డ్రైవర్‌లపై ఉన్న కేసులు, ఫైన్లు, ఈ చలానాలు రద్దు చేయాలి. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి. ఆటో, వాహనాల కొనుగోళ్లు, స్పేర్ పార్ట్స్ తదితర వాటిపై 1 శాతం సెస్సు విధించి, ఆటో, రవాణా రంగ డ్రైవర్‌లు, వర్కర్లు, మెకానిక్‌ల నుంచి కొంత భాగాన్ని వసూలు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు మూతపడి ఉపాధి అవకాశాలు లేక చదువుకున్న ఆధునిక యువత స్వయం ఉపాధిగా ప్రజా, సరుకు రవాణా రంగాన్ని ఎంచుకుంటుందని, వాహనాల కొనుగోలుకు రుణ సదుపాయం లేక ప్రైవేట్ ఫైనాన్షియల్ దగ్గర బందీలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా స్టాండ్లలో ఉన్న ఆటోవాలాలు సరైన బేరాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వారి పట్ల ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరించి అధిక ఫీజులు, పెనాల్టీలు, ఈ చలానాలు వసూలు చేస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు పథకంతో వారికి ఆదాయాలు మరింత తగ్గుతుందని, ఆ నష్టాన్ని ఎలా భర్తీ చేస్తారో ప్రభుత్వం చెప్పాలని కోరారు. ఈ సమస్యలపై ఆగస్టు 20వ తేదీ లోపు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

- మరో యువకుడి పరిస్థితి విషమం
- లారీ, బైక్ ఢీకొనడంతో ప్రయాదం


కోండ్రు కరుణ (ఫైల్)

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందగా మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనకు సంబంధించి గరివిడి ఎస్సై ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి డీఎఫ్ఎన్ ప్రాంతానికి చెందిన కోండ్రు కరుణ(26), రేవంత్, నూకరాజులు బైక్ మీద వెళ్తుండగా ఫేకర్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ, బైక్ ఢీకున్నాయి. దీంతో జరిగిన ప్రమాదంలో కోండ్రు కరుణ సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. మరో యువకుడు రేవంత్ తీవ్ర గాయాలతో పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. నూకరాజు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

మంచం మీద నుంచి జారిపడి..


రామచంద్రరావు మృతదేహం

జామి: మండల కేంద్రం జామిలో ఎస్సీ కాలనీకి చెందిన కుంచంగి రామచంద్రరావు (37) ప్రమాదవశాత్తు మంచంపై నుంచి కింద పడి ఊపిరాడక మంగళవారం మృతిచెందాడు. తన ఇంటిలో మంచంపై పడుకుని పిల్లల కోసం కట్టిన ఉయ్యాలలో తలపెట్టి ఊగడంతో అకస్మాత్తుగా జారిపడి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఝాన్సీ ఫిర్యాదు మేరకు జామి ఎస్సై వీరబాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసు నమోదు


నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధి అమ్మపాలెం గ్రామానికి చెందిన దేవాపురపు దేముడుపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీఎస్.మూర్తి తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. దేవాపురపు దేముడు తన భార్య రమణమ్మపై అనుమానంతో ఈనెల 11వ తేదీ రాత్రి ఆమెతో గొడవపడి 8గంటల సమయంలో తలపై కర్రతో కొట్టాడు. దీంతో రక్తస్రావమై ఆమె స్పృహ కోల్పోయింది. ఆమెను కుటుంసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ 12వ తేదీ రాత్రి చనిపోయింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు దేముడును రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన లక్ష్మణరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామానికి చెందిన టి. లక్ష్మణరావు (54) పురుగు మందు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన ఈ సంఘటనపై ఎస్సై రవీంద్ర రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మణరావు తన భర్యను హత్య చేసి జైలునుంచి బెయిల్‌పై వచ్చాడు. బంధువులు, గ్రామస్తులు తనతో ఎవరూ మాటాడడం లేదని మనస్తాపం చెంది పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

గుడిలో చోరీ


నగదు దోచుకుని వదిలిపెట్టిన హుండీ


దొంగలు పగులగొట్టిన గుడి తలుపులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపు పేట రాజబంగారమ్మ గుడిలో చోరీ జరిగింది. దీనిపై స్థానికులు మంగళవారం తెలిపిన వివరాలు ప్రకారం గ్రామదేవత రాజబంగారమ్మ గుడి తలుపులు బద్దలుగొట్టి దొంగలు హుండీ ఎత్తుకెళ్లి నగదు దోచుకున్నారు. హుండీలో సుమారు రూ.50వేలు నగదు దొంగిలించి, మిగిలిన చిల్లర పైసాలతో బద్దల కొట్టిన హుండీని గుడి పక్కనే వదిలేశారు.